# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక

1 క్రీస్తు యేసు సేవకులైన పౌలు తిమోతి,
క్రీస్తు యేసునందు ఫిలిప్పీలో ఉన్న దేవుని పరిశుద్ధులకు, సంఘ అధ్యక్షులకు, సంఘ* పరిచారకులకు వ్రాయుట:
2 మన తండ్రియైన దేవుని నుండి, ప్రభువైన యేసు క్రీస్తు నుండి కృపా సమాధానాలు మీకు కలుగును గాక.

## కృతజ్ఞత చెల్లించుట, ప్రార్థించుట

3 మీరు గుర్తుకొచ్చినప్పుడెల్లా నేను దేవునికి వందనాలు చెప్తున్నాను.
4 మీ అందరి నిమిత్తం చేసే నా ప్రతి ప్రార్థనలో నేను ఎప్పుడు సంతోషిస్తూ ప్రార్థిస్తున్నాను.
5 మొదటి నుండి ఇప్పటివరకు సువార్త విషయంలో మీరు నాతో పాలివారిగా ఉండడం చూసి,
6 మీలో ఈ మంచి కార్యాన్ని ఆరంభించినవాడు క్రీస్తు యేసు దినం వరకు దానిని కొనసాగిస్తాడని రూఢిగా నమ్ముతున్నాను.
7 నేను సంకెళ్ళలో ఉన్నా లేదా సువార్త గురించి వాదించడంలో దానిని స్థిరపరచడంలో మీరందరు నాతో కూడా ఈ కృపలో భాగస్థులుగా ఉన్నారు, కాబట్టి మీరు నా హృదయంలో ఉన్నారు. అందువల్ల మీ అందరి గురించి ఇలా భావించడం నాకు న్యాయమే.
8 యేసు క్రీస్తు దయను బట్టి మీ అందరి గురించి నేనెంత ఆశ కలిగి ఉన్నానో దేవుడే సాక్ష్యం ఇస్తారు.

* **1:1** రోమా 16:1; 1 తిమోతి 3:8,12

9-11 దేవునికి మహిమ స్తోత్రం కలుగుటకు, మీరు ఏది ఉత్తమమైనదో గ్రహించ కలిగి క్రీస్తు దినాన మీరు స్వచ్ఛముగా, నిర్దోషులుగా ఉండేలా, మీ ప్రేమ, జ్ఞానంలో, లోతైన పరిజ్ఞానాన్ని కలిగి అంతకంతకు వృద్ధిచెందాలని, క్రీస్తు యేసు నుండి వచ్చే నీతిఫలంతో మీరు నింపబడాలని మీ కోసం ప్రార్థిస్తున్నాను.

## పౌలు సంకెళ్ళు సువార్తను విస్తరించుట

12 సహోదరీ సహోదరులారా, నాకు కలిగిన శ్రమల కారణంగా సువార్త మరి ఎక్కువగా విస్తరించిందని మీరు తెలుసుకోవాలని నేను కోరుతున్నాను.

13 దాని ఫలితంగా, క్రీస్తు కోసం నేను సంకెళ్ళలో ఉన్నానని, రాజమందిరాన్ని కాపలా కాసేవారందరికి, అందరికి స్పష్టంగా తెలిసింది.

14 నా సంకెళ్ళ మూలంగా సహోదరీ సహోదరులలో చాలామంది ప్రభువులో స్థిరమైన విశ్వాసం కలిగి, నిర్భయంగా దేవుని వాక్యాన్ని బోధించడానికి మరి ఎక్కువ ధైర్యం తెచ్చుకున్నారు.

15 కొందరు అసూయతో, విరోధంతో క్రీస్తును ప్రకటిస్తున్నారనేది నిజమే, కాని ఇతరులు మంచి ఉద్దేశంతోనే ప్రకటిస్తున్నారు.

16 నేను సువార్త గురించి వాదించడానికి ఇక్కడ నియమించబడ్డానని తెలుసుకున్న తర్వాత, వారు ప్రేమతో ప్రకటిస్తున్నారు.

17 గతంలో నేను సంకెళ్ళలో ఉన్నప్పుడు నాకు మరింత ఇబ్బంది కలిగించాలనే తలంపుతో, వారు మంచి ఉద్దేశంతో కాకుండా స్వార్థపూరిత ఉద్దేశంతో, క్రీస్తును గురించి ప్రకటించారు.

18 అయితే ఏంటి? మంచి ఉద్దేశమైన లేదా చెడ్డ ఉద్దేశమైన ప్రతీ మార్గంలోనూ క్రీస్తు గురించి ప్రకటించబడుతుంది అనేదే ముఖ్యము. దానిని బట్టి నేను సంతోషిస్తున్నాను.

ఇకముందు కూడా నేను సంతోషిస్తాను.

19 ఎందుకంటే, మీ ప్రార్థన వలన, యేసు క్రీస్తు యొక్క ఆత్మ నాకు
సమృద్ధిగా అనుగ్రహించబడుట వలన, నాకు ఏమి జరిగినా అది నాకు
రక్షణగానే మారుతుందని నాకు తెలుసు.
20 నేను ఏ విషయంలోను సిగ్గుపడకుండా ఎప్పటిలాగానే ఇప్పుడు
కూడా పూర్ణధైర్యంతో బోధించడం వలన నేను జీవించినా లేదా
మరణించినా సరే, నా శరీరంలో ఎప్పుడూ క్రీస్తు ఘనపరచబడాలని
నేను ఆసక్తితో ఆశించి నిరీక్షిస్తున్నాను.
21 నాకైతే జీవించడం క్రీస్తు కొరకే, మరణమైతే లాభము.
22 ఒకవేళ నేను శరీరంలోనే జీవించాల్సి ఉంటే, ఇది నాకు
ఫలభరితమైన ప్రయాసం అవుతుంది. అయినా నేను ఏమి
కోరుకోవాలి? నాకు తెలియదు!
23 ఈ రెండింటికీ మధ్య నేను నలిగిపోతున్నాను. నేను ఈ లోకాన్ని
విడిచిపెట్టి క్రీస్తుతో కూడా ఉండాలని నా ఆశ, అది నాకు చాలా
మంచిది.
24 అయితే నేను శరీరంతో ఉండడం మీకు ఎంతో అవసరము.
25 మీరు విశ్వాసంలో వృద్ధి చెంది ఆనందించడానికి, నేను జీవిస్తూ,
మీ అందరితో కలసి ఉంటానని నాకు తెలుసు.
26 ఇలాంటి నమ్మకం కలిగి, నేను మరల మీతో కలిసి ఉండడం వల్ల
నన్ను బట్టి క్రీస్తు యేసులో మీకున్న ఆనందం అధికమవుతుంది.

## సువార్తకు తగిన జీవితము

27-28 ఏమి జరిగినా, క్రీస్తు సువార్తకు తగినట్లు మీరు ప్రవర్తించండి.
నేను వచ్చి మిమ్మల్ని చూసినా లేదా నేను లేనప్పుడు మీ గురించి
వినినా, మిమ్మల్ని వ్యతిరేకించేవారికి మీరు ఏ విధంగాను భయపడక,
మీరు ఒకే ఆత్మలో దృఢంగా నిలిచి, సువార్త విశ్వాసం కోసం మీరు
ఒకటిగా పోరాడుతున్నారని నేను తెలుసుకుంటాను. వారు నాశనం
అవుతారు కాని మీరు రక్షించబడతారు, అది వారికి దేవుడు ఇచ్చే ఒక
సూచన.
29 మీరు క్రీస్తులో విశ్వాసం ఉంచడమే కాదు, ఆయన కోసం శ్రమలు
కూడా అనుభవించాలని ఆయన తరపున ఇది మీకు ఇవ్వబడింది,

30 నేను ఏ శ్రమలు అనుభవించడం మీరు చూశారో ఇప్పుడు
మీరు ఆ శ్రమల గుండానే వెళ్తున్నారు, అయితే నేను కూడా ఇంకా
శ్రమలగుండా వెళ్లాల్సి ఉంది.

# 2

## క్రీస్తు వినయాన్ని అనుకరించుట

1 అయితే మీకు క్రీస్తులో ప్రోత్సాహం గాని, ఆయన ప్రేమ వలన
ఆదరణ గాని, ఆత్మలో ఏ సహవాసం గాని, దయ, కనికరం గాని
కలిగినచో,
2 మీరు ఏక మనస్సు, ఒకే ప్రేమ కలిగి, ఆత్మలో ఒక్కటిగా ఉంటూ
ఒకే భావం కలవారిగా ఉండి, నా సంతోషాన్ని పరిపూర్ణం చేయండి.
3 స్వార్థపూరిత ఆశలతో లేదా వ్యర్థమైన గర్వంతో ఏమి చేయకండి.
దానికి బదులు, వినయంతో ఇతరులకు మీకంటే ఎక్కువ విలువను
ఇస్తూ,
4 మీ సొంత పనులపై మాత్రమే ఆసక్తి చూపక, మీలో ప్రతి ఒక్కరు
ఇతరుల పనులపై కూడా ఆసక్తి చూపించాలి.
5 మీలో ఒకరితో ఒకరికి గల మీ సంబంధాల్లో క్రీస్తు యేసు కలిగి ఉన్న
స్వభావాన్నే మీరు కూడా కలిగి ఉండండి:

6 ఆయన దేవుని స్వరూపాన్ని పూర్తిగా కలిగినవాడై ఉండి,
దేవునితో సమానంగా ఉండడాన్ని విడిచి పెట్టకూడని భాగ్యమని
భావించలేదు;
7 కాని దాసుని స్వరూపాన్ని ధరించుకొని
తనను తాను ఏమీ లేనివానిగా చేసికొని
మనుష్యుని పోలికగా పుట్టారు.
8 మనుష్యునిగా కనబడి
మరణానికి విధేయత చూపించడం ద్వారా
అనగా సిలువ మరణం పొందేంతగా
తనను తాను తగ్గించుకున్నారు!

9 అందువల్ల దేవుడు ఆయనను ఉన్నత స్థానానికి హెచ్చించి
అన్ని నామముల కంటే పై నామాన్ని ఆయనకిచ్చారు,
10 యేసు నామమున ప్రతివారి మోకాలు వంగునట్లు,
పరలోకమందును భూమి మీదను భూమి క్రిందను,
11 ప్రతి నాలుక యేసు క్రీస్తు ప్రభువని ఒప్పుకుంటుంది,
తండ్రియైన దేవునికి మహిమ కలుగును గాక.

### నక్షత్రాల్లా ప్రకాశించుట

12 కాబట్టి, నా ప్రియ స్నేహితులారా, మీరు ఎప్పుడు లోబడి
ఉన్నట్లుగానే నేను ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, నేను మీతో
లేనప్పుడు మరి ఎక్కువ లోబడి భయంతో వణుకుతో మీ సొంత
రక్షణను కొనసాగించండి.
13 ఎందుకంటే దేవుని మంచి ఉద్దేశాలను నెరవేర్చడానికి మీరు
ఇష్టపడడానికి, వాటిని చేయడానికి, మీలో కార్యాన్ని జరిగించేది
దేవుడే.
14 సణుగుకోకుండా లేదా వాదించకుండా ప్రతిదాన్ని చేయండి.
15-16 తద్వారా మీరు నిందలేనివారిగా, శుద్ధులుగా, "చెడిపోయిన
వక్రమైన ఈ తరం మధ్యలో, మీరు దోషంలేని* దేవుని బిడ్డలు"
అవుతారు. మీరు జీవవాక్యాన్ని స్థిరంగా పట్టుకుని ఉన్నప్పుడు, మీరు
ఆకాశంలోని నక్షత్రాల్లా వారి మధ్యలో ప్రకాశిస్తారు. అప్పుడు నేను
వృధాగా పరుగు పెట్టలేదు లేదా శ్రమపడలేదని క్రీస్తు దినాన నేను
అతిశయించగలను.
17 మీ విశ్వాస యాగంలో దానికి సంబంధించిన సేవలో నేను
పానార్పణంగా పోయబడినప్పటికి, మీతో కలిసి సంతోషించి
ఆనందిస్తాను.
18 కాబట్టి మీరు కూడా నాతో కలిసి సంతోషించి ఆనందించండి.

### తిమోతి ఎపఫ్రొదితు

* **2:15-16** ద్వితీ 32:5

19 మీరు ఎలా ఉన్నారో నేను కూడా తెలుసుకుని సంతోషించాలని,
ప్రభువైన యేసులో తిమోతిని త్వరలో మీ దగ్గరకు పంపాలని నేను
అనుకుంటున్నాను.
20 అతనిలా మీ క్షేమం గురించి నిజమైన ఆసక్తి కలిగినవారు నా
దగ్గర ఎవరు లేరు.
21 ప్రతి ఒక్కరు తమ సొంత పనులపైనే ఆసక్తి చూపిస్తున్నారు, కాని
యేసు క్రీస్తు పనులపై కాదు.
22 తిమోతి యోగ్యుడని మీకు తెలుసు, ఎందుకంటే ఒక
కుమారుడు తన తండ్రికి సేవ చేసినట్లుగా సువార్త పనిలో అతడు
నాతో కలిసి సేవ చేశాడు.
23 కాబట్టి నాకు ఏమి జరుగబోతుందో నేను చూసిన వెంటనే,
అతన్ని పంపాలని అనుకుంటున్నాను.
24 నేనూ త్వరలోనే వస్తానని ప్రభువులో నాకు నమ్మకం ఉంది.

25 నా సహోదరుడు, జతపనివాడు, నా తోటి యోధుడు, నా
అవసరాలను చూసుకోవడాని మీరు పంపిన మీ దూతయైన
ఎపఫ్రొదితును తిరిగి మీ దగ్గరకు పంపవలసిన అవసరం ఉందని
నేను అనుకుంటున్నాను.
26 అతడు అనారోగ్యంగా ఉన్నాడని మీరు విన్నారు, కాబట్టి మీ
అందరిని చూడాలని ఆశపడుతూ దుఃఖపడుతున్నాడు.
27 అతడు అనారోగ్యంతో చనిపోయే స్థితిలో ఉన్నాడు కాని దేవుడు
అతన్ని కనికరించారు. అతన్నే కాదు నాకు దుఃఖం మీద దుఃఖం
కలుగకుండా నన్ను కూడా కనికరించారు.
28 మీరు అతన్ని మరలా చూసినప్పుడు మీరు సంతోషిస్తారు,
అలాగే నా వేదన కొంత తగ్గుతుంది, కాబట్టి అతన్ని పంపాలని
అందరికంటే నేనే ఎక్కువ ఆశపడుతున్నాను.
29 గొప్ప సంతోషంతో ప్రభువులో అతన్ని ఆదరించండి,
అతనిలాంటి వారిని గౌరవించండి.
30 ఎందుకంటే క్రీస్తు పని కోసం అతడు చనిపోవడానికి కూడా
సిద్ధపడ్డాడు. మీరు నాకు చేయలేని సహాయాన్ని చేయడానికి అతడు

తన ప్రాణాన్ని సైతం లెక్కచేయలేదు.

# 3

## శరీరం మీద నమ్మకం ఉంచకండి

1 చివరిగా, నా సహోదరీ సహోదరులారా, ప్రభువులో
ఆనందించండి! మరల అవే సంగతులను మీకు వ్రాయడం నాకు
కష్టం కలిగించదు, అది మీకు రక్షణ కవచము.
2 ఆ కుక్కల గురించి, ఆ కీడుచేసేవారు, శరీరాన్ని ముక్కలు
చేసేవారి గురించి జాగ్రత్త.
3 ఎందుకంటే, మనం సున్నతి పొందినవారం, దేవుని ఆత్మ చేత
ఆయనను ఆరాధిస్తాం, క్రీస్తు యేసులో అతిశయపడతాం, శరీరంపై
నమ్మకం ఉంచండి.
4 కావాలంటే నేను శరీరంపై అలాంటి నమ్మకాన్ని కలిగి ఉండవచ్చు.
ఎవరైనా శరీరంపై నమ్మకం ఉంచడానికి తమ దగ్గర కారణాలు
ఉన్నాయని అనుకుంటే, వారికంటే నా దగ్గర ఎక్కువ ఉన్నాయి.
5 నేను ఎనిమిదవ రోజున సున్నతి పొందాను, ఇశ్రాయేలు
వంశానికి చెందినవాన్ని, బెన్యామీను గోత్రంలో పుట్టాను, హెబ్రీయుల
సంతానమైన హెబ్రీయుడను; ధర్మశాస్త్ర విషయంలో పరిసయ్యుడను.
6 అత్యాసక్తితో సంఘాన్ని హింసించాను; ధర్మశాస్త్రం ఆధారం
చేసుకుని నీతి విషయంలో నిరపరాధిని.
7 అయితే, ఏవైతే నాకు లాభదాయకంగా ఉన్నాయో, నేను ఇప్పుడు
వాటిని క్రీస్తు నిమిత్తం నష్టంగా భావించాను.
8 నిశ్చయంగా నా ప్రభువైన క్రీస్తు యేసును తెలుసుకోవడం
విలువైనది కాబట్టి నేను ప్రతిదీ నష్టంగా భావిస్తున్నాను. నేను క్రీస్తును
సంపాదించుకోడానికి సమస్తాన్ని వ్యర్థంగా భావిస్తున్నాను.
9 క్రీస్తును సంపాదించుకుని, ధర్మశాస్త్రం వలన కలిగే నా నీతిని
కాకుండా, క్రీస్తులోని విశ్వాసాన్నిబట్టి దేవుడు దయ చేసిన నీతిని కలిగి
ఆయనలో కనబడాలని,

10 నేను క్రీస్తును తెలుసుకోవాలని కోరుతున్నాను, అవును,
ఆయన పునరుత్థాన శక్తిని తెలుసుకోవాలని, ఆయన శ్రమలలో
పాలుపంచుకోవడం, ఆయన మరణంలో ఆయనలా కావడం,
11 అలా, ఏదో ఒక విధంగా, మృతులలో నుండి పునరుత్థానం
పొందడము.
12 నేను ఇప్పటికే ఇవన్నీ పొందానని గాని, నా లక్ష్యాన్ని
చేరుకున్నానని గాని నేను భావించడంలేదు, కాని దేనికోసం క్రీస్తు
యేసు నన్ను పట్టుకున్నారో దానిని పట్టుకోవాలని పరుగెడుతున్నాను.
13 సహోదరీ సహోదరులారా, నేను ఇంతకుముందే దానిని
పట్టుకున్నానని భావించను, అయితే నేను చేస్తున్నది ఒకటే,
వెనుక ఉన్నవాటిని మరచిపోయి ముందున్న వాటికోసం
ప్రయాసపడుతున్నాను,
14 క్రీస్తు యేసులో దేవుని ఉన్నత పిలుపు వలన కలిగే
బహుమానాన్ని గెలవడానికి, లక్ష్యం వైపే పరుగెడుతున్నాను.

### పౌలు మాదిరిని అనుసరించుట

15 కాబట్టి మనలో సంపూర్ణులమైన వారందరం ఇదే భావాన్ని కలిగి
ఉందాము. అప్పుడు దేని గురించైనా మీరు వేరుగా ఆలోచిస్తే, దాన్ని
కూడా దేవుడు మీకు స్పష్టం చేస్తారు.
16 అయినా ఇప్పటివరకు మనం పొందుకున్న దానిని బట్టే క్రమంగా
జీవిద్దాము.
17 సహోదరీ సహోదరులారా, మీరు నా మాదిరిని అనుసరించండి.
మేము మీకు మాదిరిగా ఉన్నట్లే, ఎవరైతే మాలా జీవిస్తారో వారిపై మీ
దృష్టిని ఉంచండి.
18 అనేకమంది క్రీస్తు సిలువకు శత్రువులుగా జీవిస్తున్నారు, గతంలో
వీరిని గురించి మీతో అనేకసార్లు చెప్పినా, మరల ఇప్పుడు కన్నీటితో
చెప్తున్నాను.
19 వారి గమ్యం నాశనం, వారి కడుపే వారికి దేవుడు,
తాము సిగ్గుపడవలసిన వాటిలో వారు గర్వపడుతున్నారు.
భూసంబంధమైన వాటిపైనే తమ మనస్సు ఉంచుతున్నారు.

20 అయితే మన పౌరసత్వం పరలోకంలో ఉంది, కాబట్టి
అక్కడినుండి వచ్చే మన రక్షకుడు ప్రభువైన యేసు క్రీస్తు గురించి
ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము.
21 సమస్తాన్ని తన ఆధీనంలోనికి తీసుకురాగల తన శక్తినిబట్టి,
ఆయన మన నీచమైన శరీరాలను తన మహిమగల శరీరాన్ని పోలి
ఉండేలా మార్చగలరు.

# 4

## చివరిగా స్థిరత్వం ఏకత్వం కోసం విన్నపం

1 కాబట్టి, నా సహోదరీ సహోదరులారా, నా ఆనందం నా కిరీటమైన
నా ప్రియ స్నేహితులారా, నేను మిమ్మల్ని ప్రేమించి, ఈ విధంగా మీరు
ప్రభువులో స్థిరంగా నిలబడి ఉండాలని కోరుకుంటున్నాను.
2 ప్రభువులో ఏక మనస్సు కలిగి ఉండమని యువొదియను,
సుంటుకేను బ్రతిమాలుతున్నాను.
3 అవును, నా నిజమైన సహకారీ, జీవగ్రంథంలో పేర్లు వ్రాయబడిన
ఈ స్త్రీలు క్లెమెంతుతో మిగతా నా సహపనివారితో కలిసి సువార్త పనిలో
నాతోకూడ ప్రయాసపడ్డారు. కాబట్టి వారికి సహాయం చేయమని నిన్ను
అడుగుతున్నా.

## చివరి హెచ్చరికలు

4 ఎల్లప్పుడు ప్రభువులో ఆనందించండి, మరల చెప్తున్నాను
ఆనందించండి.
5 మీ శాంత స్వభావాన్ని అందరికి స్పష్టంగా తెలియనివ్వండి.
ప్రభువు సమీపంగా ఉన్నారు.
6 దేన్ని గురించి వేదన పడకండి, కాని ప్రతి విషయంలో
ప్రార్థనావిజ్ఞాపనల చేత కృతజ్ఞతా పూర్వకంగా మీ విన్నపాలను
దేవునికి తెలియజేయండి.
7 అప్పుడు సమస్త జ్ఞానానికి మించిన దేవుని సమాధానం యేసు
క్రీస్తు వలన మీ హృదయాలను మీ తలంపులను కాపాడుతుంది.

8 చివరిగా, సహోదరీ సహోదరులారా, ఏదైనా యోగ్యమైనదిగా
లేదా మంచిగా ఉంటే, సత్యమైన వాటి మీద, గొప్పవాటి మీద,
న్యాయమైన వాటి మీద, పవిత్రమైన వాటి మీద, సుందరమైన వాటి
మీద, ఘనమైన వాటి మీద మీ మనస్సులను పెట్టండి.
9 మీరు నా నుండి ఏవి నేర్చుకున్నారో, పొందారో లేదా విన్నారో
లేదా నాలో ఏమి చూశారు వాటిని ఆచరణలో పెట్టండి. అప్పుడు
సమాధానకర్తయైన దేవుడు మీతో ఉంటారు.

## బహుమానాల కోసం కృతజ్ఞతలు

10 నా గురించి మీరు తిరిగి మరల ఆలోచిస్తున్నారని ప్రభువులో
ఎంతో సంతోషించాను. మీరు నా గురించి ఆలోచిస్తున్నారు, గాని
దానిని చూపించడానికి తగిన అవకాశం మీకు దొరకలేదు.
11 నేను అవసరంలో ఉన్నానని ఇలా చెప్పడం లేదు. ఎందుకంటే ఏ
స్థితిలో ఉన్నా, ఆ స్థితిలో తృప్తి కలిగి ఉండడం నేను నేర్చుకున్నాను.
12 దీనస్థితిలో ఉండడం అంటే నాకు తెలుసు, సంపన్న స్థితిలో
ఉండడం కూడా నాకు తెలుసు. ఏ స్థితిలోనైనా అన్ని పరిస్థితుల్లో
అనగా, కడుపునిండా తిన్నా లేదా ఆకలితో ఉన్నా, సమృద్ధిగా ఉన్నా
లేదా అవసరంలో ఉన్నా తృప్తి కలిగి ఉండడానికి రహస్యాన్ని నేను
నేర్చుకున్నాను.
13 నన్ను బలపరిచే ఆయనలోనే నేను ఇవన్నీ చేయగలను.
14 అయినప్పటికీ మీరు నా శ్రమలలో భాగం పంచుకోవడం మంచి
పని.
15 అంతేకాక, ఫిలిప్పీయులారా, మీరు సువార్తను తెలుసుకున్న
తొలి రోజుల్లో, నేను మాసిదోనియలో నుండి పంపబడినప్పుడు,
ఇవ్వడంలో తీసుకోవడంలో కేవలం మీరు తప్ప మరి ఏ సంఘం నాతో
పాలివారు కాలేదని మీకు తెలుసు.
16 నేను థెస్సలొనీకలో ఉన్నప్పుడు కూడా, నేను అవసరంలో
ఉన్నప్పుడు అనేకసార్లు మీరు సహాయాన్ని పంపించారు.

17 నేను మీ కానుకలను కోరుకోవడంలేదు; మీరు ఇంకా అధికంగా
పొందుకోవాలని కోరుకుంటున్నాను.
18 నేను సమృద్ధిగా పూర్తిగా పొందాను. మీరు పంపిన కానుకలు
ఎపఫ్రొదితు నుండి అందుకున్నాను. అవి దేవునికి ఇష్టమైన పరిమళ
అర్పణ, అంగీకారమైన త్యాగము.
19 నా దేవుడు తన మహిమైశ్వర్యం ఆధారంగా క్రీస్తు యేసులో మీ
ప్రతి అవసరాన్ని తీరుస్తారు.
20 మన తండ్రియైన దేవునికి మహిమ నిరంతరం కలుగును గాక
ఆమేన్.

## చివరి శుభవచనములు

21 క్రీస్తు యేసులో దేవుని ప్రజలందరికి వందనాలు చెప్పండి.
నాతోకూడ ఉన్న సహోదరీ సహోదరులందరు మీకు వందనాలు
చెప్తున్నారు.
22 ఇక్కడ ఉన్న దేవుని ప్రజలందరు ముఖ్యంగా కైసరు
కుటుంబానికి చెందినవారు మీకు వందనాలు చెప్తున్నారు.

23 ప్రభువైన యేసు క్రీస్తు కృప మీ ఆత్మతో ఉండును గాక ఆమేన్.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.
You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."
Notice of copyright must appear on the title or copyright page of the work as follows:
Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.
"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.
You must also make your derivative work available under the same license (CC BY-SA).
If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.
You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

You include the above copyright and source information.

If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.

If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.
Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025
aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6